క్లుప్తంగా

తహసీల్దార్‌కు పలువురు పరామర్శ



వెంకటరావును పరామర్శిస్తున్న పద్మావతి తదితరులు

లావేరు: శ్రీకాకుళం తహసీల్దార్ నిడిగంట్ల వెంకటరావు తల్లి దుర్గమ్మ, భార్య పద్మజ ఈనెల 11వ తేదీన అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి, శ్రీకాకుళం పట్టణానికి చెందిన ద్వారపు అజిత్‌కుమార్, కింజరాపు రమేష్, బైరి మురళీ తదితరులు సోమవారం లావేరు గ్రామానికి వచ్చి వెంకటరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.వారివెంట లావేరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్.త్రినాథ్ ఉన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం తహసీల్దార్ వెంకటరావును ఆదిత్య వాకర్స్ క్లబ్ సభ్యులు పరామర్శించారు. తల్లి, భార్యను ఒకే రోజు కోల్పోవడంపై వాకర్స్ గవర్నర్ పోలుమహంతి ఉమామహేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. పరామర్శలో పి.ప్రభాకర్ పట్నాయక్, వి.బి.రమణ, పి.జె.ప్రేమ్‌కుమార్, సెక్రటరీ శాంతారాం, ఆర్.ఎస్.దొర, జి.ఆర్.జి.నాయుడు తదితరులున్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ఎచ్చెర్ల: వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎచ్చెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కిశోర్‌కుమార్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. వేసవి నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధులబారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

లావేరు: పాతకుంకాంలో వైఎస్సార్‌సీపీ నాయకులైన దంగుడుబియ్యపు సోదరులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. తొలి రోజున మజ్జిగను పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో ఎండలో ప్రయాణించేవారు దాహంతో నీటి కోసం ఇబ్బంది పడకుండా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దంగుడుబియ్యపు మురళీ, శ్రీనివాసరావు, పుచ్చల దాము పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డుపైకి మురుగునీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఎచ్చెర్ల: కుశాలపురం పంచాయతీ పారిశ్రామిక ప్రాంతం వద్ద హైవే సర్వీసు రోడ్డుపై నిత్యం మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని వాడుకనీరు బయటకు పోయేందుకు కాలువ మార్గం లేదు. మురుగు నీటిని సర్వీసు రోడ్డుపైకి విడిచిపెడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థి ప్రతిభ



మహేశ్వర్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మకమైన బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థల్లో ఒకటైన అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో (ఐఏఎం) జిల్లాకు చెందిన అముజూరు మహేశ్వర్‌కు సీటు లభించింది. మహేశ్వర్ ఈ విద్యా సంవత్సరానికిగాను జరిగిన క్యాట్ పరీక్ష ఫలితాల్లో 99.39 పర్సంటైల్ మార్కులతో ప్రవేశం పొందాడు. శ్రీకాకుళంలోని కోరాడవీధికి చెందిన మహేశ్వర్ తిరుపతిలోని వెంకటేశ్వర యూనివర్సిటీలో బీటెక్ (ఈఈఈ) పూర్తిచేసి క్యాట్ పరీక్షకు సిద్ధమయ్యాడు. ఈయన తండ్రి అముజూరు అప్పన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మేనేజర్‌గా పనిచేస్తుండగా తల్లి గృహిణి.

శివాలయాల్లో పూజలు

జి.సిగడాం: మండలంలోని పలు శివాలయల్లో ద్వాదశి సందర్భంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. చీడిపేటలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

రూ 1.13 లక్షలకువేలం ఖరారు

సారవకోట: మండలంలోని అవలింగి మార్కెట్ వేలం పాటను రూ.1,13,500లకు గుమ్మడి లక్ష్మీనారాయణ దక్కించుకున్నట్లు ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా సోమవారం తెలిపారు. వేలం పాటలో పంచాయతీ కార్యదర్శి హిమబిందు, మాజీ సర్పంచ్ కింజరాపు ధర్మారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- బుడతవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బుడతవలస గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి బుక్‌లెట్లను అందజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు వర్తించకపోతే తనకు తెలియజేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో సంక్షేమ పథకాలు మంజూరు కావాలంటే మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని.. అర్హతే ప్రామాణికంగా సచివాలయాలు, వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటి వద్దకే సంక్షేమాన్ని చేరుస్తున్నామన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సురేష్ కుమార్, ఈవోపీఆర్‌డీ వి.విశ్వేశ్వరరావు, పీఆర్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈలు ఎల్.అప్పన్న, కె.అప్పలనాయుడు, బి.శివబాబు, ఎంఈవో ఎల్.ఈశ్వరరావు, వైకేపీ మండల ఏపీఎం బి.మాధవీలత, ఉపాధి హామీ పథకం ఏపీవో ఆర్.సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, బుడతవలస పంచాయతీ సర్పంచ్ రౌతు సురేంద్ర, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రౌతు పెంటన్నాయుడు, మాజీ సర్పంచ్ రౌతు వెంకటనారాయణ, బుడతవలస సచివాలయం కన్వీనర్లు రేవళ్ల నాగరాజు, రౌతు చిరంజీవి, నాయకులు రౌతు సతీష్, కసవయ్య, మోహనరావు, రామినాయుడు, కంది సూరిబాబు, బొంతు సూర్యనారాయణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



గురువులు రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

రణస్థలం: చిల్లపేటరాజాం గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు ఆళ్ల పార్వతమ్మ భర్త గురువులు రెడ్డి అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. గురువులు రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల వ్యవసాయ మండలి చైర్మన్ పైడి శ్రీనివాసరావు, గ్రామ నాయకులు కంబపు నర్సింహులు రెడ్డి, కొణతాల లక్ష్మణరెడ్డి, కురిమిన గోవింద, చిల్ల గాంధీ, వెంకటరావు, బందారు కృష్ణ, సత్యనారయణ, లక్ష్మణరావు ఉన్నారు.

నారువ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల రామసూరి, రాములు బంధువు నిద్రబంగి సత్యం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పరామర్శించారు. నాయకులు నిద్రబంగి నర్సింహులు, ఆళ్ల కృష్ణ, గిన్ని సత్యం ఉన్నారు.

నియామకపత్రాల అందజేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలుగా ఎంపికైన వారికి మంత్రి ధర్మాన ప్రసాదరావు నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగింది. గార మండలం వాడాడ పంచాయతీ అచ్చంపాలెం గ్రామానికి చెందిన గొండు కవితకు నియామక పత్రాన్ని మంత్రి అందించారు. గార ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో రాధామాధవి పాల్గొన్నారు.

25 నుంచి ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ లలితా మహాత్రిపుర సుందరీదేవీ పీఠంలో ఈనెల 25 నుంచి మే ఐదో తేదీ వరకు జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు పీఠం నిర్వాహకులు పెంటరామ చంద్రశేఖరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ విశేష అర్చనలు, పూజలు జరుగుతాయన్నారు. 25న సాయంత్రం వేదసభ జరుగుతోందన్నారు. జగద్గురు వైభవం కోసం ప్రసంగం ఉంటుందన్నారు. 30న శంకర విజయ కవిసమ్మేళనం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఆమదాలవలస రూరల్: పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 19వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ శిక్షణకు హాజరుకావాల్సిన విద్యార్థులు ఈ నెల 18 నుంచి కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన, పరీక్షలు రాసిన విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు. శిక్షణ తరగతుల అనంతరం చివరిగా పాలిసెట్ 2023 నమూనా పరీక్ష నిర్వహిస్తామన్నారు.

పెదలింగాలవలసలో స్వామిత్వ సర్వే



సర్వేపై మ్యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి రమణ

లావేరు: పెదలింగాలవలస పంచాయతీలో స్వామిత్వ న్యూ అప్రోచ్ గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే చేపట్టనున్నట్టు సర్పంచ్ లుకలాపు యశోద, కార్యదర్శి ఎం.రమణ తెలిపారు. సర్వే ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. సర్వే చేపట్టే విధానాన్ని సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మ్యాప్ ద్వారా పంచాయతీ కార్యదర్శి రమణ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పెదలింగాలవలస పంచాయతీలో స్వామిత్వ సర్వే చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు గ్రామ కంఠంలో ఉన్నాయా, సర్కార్ భూముల్లోనా, జిరాయితీ భూముల్లో ఉన్నాయా, పోరంబోకు భూముల్లో ఉన్నాయా వంటి వివరాలను సర్వేలో సేకరించి డీపీవోకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బూత్‌కమిటీ మండల మాజీ కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ భరత్, మాజీ సర్పంచ్ శివాంగం నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక పాలన తగదు



మాట్లాడుతున్న వెంకటరమణ

లావేరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన చేయడం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వెంకటరమణ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారన్నారు. మండల కేంద్రం లావేరులో సీఐటీయూ మండల మహాసభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాల సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీ పరం చేయాలని చూస్తోందన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎం.గౌరీ శంకర్, కోకన్వీనర్లుగా ఎల్.లక్ష్మి, బి.ఉత్తర, కె. సుజాత, ఎల్.రాంబాబు, సభ్యులుగా ఎం.చక్రధర్, టి.హేమ, ఎల్.చిన్నమ్మడు, బి.శ్రీరాంమూర్తి, టి.రామానుజమ్మ, బి.అన్నపూర్ణ, ఎ.ఈశ్వరరావు, కె.రామోజీరావులు ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



వాండ్రంగిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

జి.సిగడాం: 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. ఆనందపురం, వాండ్రంగి, జాడ, ఎందువ గ్రామాల్లో ఆయా గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గోడలపై అతికించారు.

ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తేవాలి



సన్మానం పొందిన నూతన ఉపాధ్యాయులతో విద్యాశాఖ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తెచ్చేలా బాధ్యతగా పనిచేయాలని ఎచ్చెర్ల ఎంఈవో కారు పున్నయ్య అన్నారు. స్థానిక మండల రీసోర్స్ కేంద్రంలో 1998 డీఎస్సీ ఉపాధ్యాయులకు సోమవారం అభ్యసన ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఉద్యోగాలు పొందిన వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం వారినుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థి కేంద్ర బిందువుగా విద్య సాగాలన్నారు. తమకు ఉన్న నైపుణ్యాలు, అనుభవంతో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయలు ఉరిటి ప్రసాదరావు, దుప్పల వెంకటేశ్వర్లు, ఎస్వీ రమణ, మొదలవలస ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

రూపాదేవికి సత్కారం



రూపాదేవిని సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ఐదవ జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు, రెండు వెండి పతకాలను సాధించిన సంతవురిటి గ్రామానికి చెందిన పడాల రూపాదేవి ప్రతిభను ఉపాధ్యాయులు కొనియాడుతున్నారు. చంద్రయ్యపేట పాఠశాలలో పని చేస్తున్న మక్క గంగేశ్వరి, పేకల రమేష్, ఉరిటి సతీష్ పట్నాయక్, వల్లూరి రమణ, పి.కోటేశ్వరావు, పద్మావతి, గార మండలం తండ్యాలపేట పాఠశాలకు చెందిన మీసాల సంధ్యారాణి, అద్వానంపేట పాఠశాలకు చెందిన సీతమ్మ సోమవారం రూపాదేవిని సత్కరించారు. కొంత నగదును అందజేశారు. రూపాదేవికి రెండు కాళ్లు లేకపోయినా ఆత్మస్థైర్యంతో జాతీయ స్థాయిలో సత్తాచాటడం అభినందనీయమన్నారు. మరిన్ని పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రణస్థలం: అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన ఉండాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైలా అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నడుకుదిటిపాలెంలోని ఎన్ఈఆర్ స్కూల్లో అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మంటల నివారణ పరికరాల వినియోగం తెలుసుకొని ఉండాలన్నారు. ఇంట్లో నిత్యం వినియోగించే గ్యాస్, ఆయిల్‌కు మంటలు వ్యాపించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, నివారణ పద్ధతులను డెమో చేసి చూపించారు. అగ్ని ప్రమాదాల నివారణ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఉన్నారు.

వేట విరామ బోట్ల లెక్కింపు



బోట్ల సర్వేలో పాల్గొన్న మత్స్యశాఖ సిబ్బంది

రణస్థలం: చేపల వేట నిషేధం నేపథ్యంలో మత్స్యకార గ్రామాల్లో అర్హులైన బోట్లను లెక్కిస్తున్నామని మండల మత్స్యశాఖాధికారి కె.గంగాధరరావు తెలిపారు. ఇందులో భాగంగా జీరుపాలెం గ్రామంలో ఇంజన్, కట్లల తెప్పలను సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా అన్నిరకాల రాయితీలు, పథకాలకు అర్హత కల్పించేందుకు సర్వే చేస్తున్నామని చెప్పారు. జీరుపాలెంలో ఇంజన్ బోట్లు 92, కట్లల తెప్పలు 125 ఉన్నట్టు గుర్తించామన్నారు. కార్యక్రమంలో మైలపల్లి కామరాజు, గ్రామ పెద్దలు రాము, వీఎఫ్ఏ మన్మథరావు, రవికుమార్, సుప్రియ, సురేష్ ఉన్నారు.

సచివాలయాల సందర్శన



భగీరథపురం గ్రామ సచివాలయంలో సమీక్షిస్తున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా చేర్చాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఇబ్రహింబాద్, భగీరథపురం గ్రామ సచివాలయాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. రబీ ఈక్రాపింగ్ పూర్తి చేయడంతోపాటు, ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఫీవర్ సర్వే నిరంతరం కొనసాగాలన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు సూర వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన కార్యక్రమం



పూజలు చేస్తున్న పరాత్మానంద సరస్వతి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా పరిషత్ ఎదురుగా..హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో పరమపూజ్య స్వామిని శారదా ప్రియానందుల వారి 23వ ఆరాధన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా స్వామి పరాత్మానంద సరస్వతీ మాట్లాడుతూ.. ఆమె ఎంతో జ్ఞానశక్తి కలదని, అయిన సాధారణ జీవనం సాగించారన్నారు. ముందుగా మాతాజీ అష్టోత్తర పూజ, భగవత్ గీత, ఉపనిషత్తుల పారాయణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భయపెడుతున్న కుక్కలు!



హడ్కోకాలనీలో మహిళ వెంట పడుతున్న కుక్కలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగర వాసులను కుక్కలు భయపెడుతున్నాయి. ఏ సందులో చూసినా కుక్కలే దర్శనమిస్తున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటకు రావడానికి జనం జంకుతున్నారు. రాత్రి, పగలనే తేడా లేకుండా గుంపుగుంపులుగా సంచరిస్తున్న శునకాలతో భయాందోళన చెందుతున్నారు. హోటళ్లు, టిఫిన్, చికెన్, మటన్ దుకాణాల సమీపంలో పరిస్థితి మరీ ఘోరంగా ఉందని..అటు వైపు వెళ్లేందుకు ధైర్యం చేయలేకపోతున్నామని ప్రజలు చెబుతున్నారు. కొన్నిచోట్ల వాహనాలను వెంబడిస్తుండడంతో అదుపుతప్పి పడిపోయి గాయపడుతున్నారు. అలాగే నడిచివెళ్లేవారిపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని నగర వాసులు వాపోతున్నారు. నగరంలో ఊర కుక్కలు 12 వేలకు పైగా ఉండగా.. పెంపుడు కుక్కలు అధికారిక లెక్కల ప్రకారం 3,280 ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పెంపుడు కుక్కలకయితే వాటి యజమానులు తగు జాగ్రత్తలు చేపట్టి టీకాలు వేయిస్తున్నారు. అంతేకాకుండా యాంటీరేబిస్ వంటి టీకాలు కూడా ఎప్పటికప్పుడు వేయిస్తున్నారు. కాని ఊర కుక్కలను మాత్రం నియంత్రించేవారే కరువయ్యారు.

ఆరేళ్ల క్రితం..

నగరంలో కుక్కల కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేసి సుమారు ఆరేళ్లయింది.ఆ తరువాత వీటి నియంత్రణకు నగరపాలక అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుటుంబ నియంత్రణ చేపట్టాలి

ఆడ, మగ కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేపట్టాలి. కుక్కలను బంధించేవారు ఆపరేషన్ తరువాత వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలి. అందుకోసం పశువైద్య సిబ్బంది సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఊర కుక్కలకు రేబీస్ వ్యాధి సోకకుండా టీకాలు వేస్తాం. ప్రజారోగ్య, నగరపాలక సిబ్బంది, పశుసంవర్ధకశాఖల సమన్వయంతో ముందుకు సాగితే నియంత్రణ చాలా సులువవుతుంది.

–డాక్టర్ వై.వి కృష్ణారావు, అసిస్టెంట్ డైరెక్టర్, శ్రీకాకుళం.

భయమేస్తోంది..



రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా కుక్కలు తిరుగుతున్నాయి. ఇంటి నుంచి బటయకు వచ్చేందుకు భయమేస్తోంది. నీలమ్మగుడి వద్ద కుక్క కరిచింది. దీంతో రోజా ఇంజక్షన్లు వేయించుకుంటున్నాను.

– తోట కిశోర్, కుక్కకాటు బాధితుడు, గూనపాలెం



దే అండ్ నైట్ కూడలిలో గుంపుగా ఉన్న కుక్కలు

చర్యలు చేపడుతున్నాం



నగరంలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాం. గ్రీన్‌మెర్సీకి వర్క్ ఆర్డర్ ఇవ్వడం జరిగింది. పనులు దక్కించుకున్న వారు పనులు చేపట్టకుంటే రద్దుచేసి వేరేవారికి ఇస్తాం. నియంత్రణ చర్యలు చేపట్టి ప్రజలు కుక్కకాటుకి గురికాకుండా చర్యలు చేపడుతున్నాం.

–జి.వెంకటరావు, హెల్త్‌ఆఫీసర్, శ్రీకాకుళం కార్పొరేషన్.